కానీ ఏం లాభం సగమే రాసి మరణించింది. ఆ రాసిన సగంలోనూ హీరోయిన్ చేత అమెరికా గురించిన మత్తు మత్తు డైలాగులు చెప్పించింది. ఈ నవల చదివిన ప్రతి యువకుడూ యువతీ ' అమెరికా వెళ్లకపోవటం దురదృష్టం! అసలు అమెరికాలో పుట్టకపోవటమే గొప్ప దౌర్భాగ్యం' అని అనుకునేటట్లు చేసింది. రచయిత్రి బతికే ఉంటే కథను ఎలా ముగించి ఏం ఉపకారం చేసేదో తెలియదు కానీ ఇంతవరకూ రాసిన దాంతో మాత్రం ఆమె అపకారమే చేసింది విదేశీ సంస్కృతి పట్ల మోజునూ, స్వదేశీ సంస్కృతి పట్ల చిన్న చూపునూ పెంచే ఈ నవల యువత చేతుల్లో పడటం ప్రమాదకరం కానీ ఈ కథకు గొప్ప పబ్లిసిటీ ఇస్తున్న పబ్లిషరు రేపొస్తున్నాడు దీన్ని తీసుకెళ్లటానికి. వాడి కిదిదక్కకుండా చేయటం చాలా అవసరం. రచయిత్రి తాలూకు టైపిస్టుగా ఆమెకున్న మంచి పేరును నిలబెట్టడానికి దీన్ని నాశనం చేయటం నా ధర్మం అందుకో. నడు!'' అన్నాడు

ఆ రాత ప్రతితో ఇద్దరూ బయటకు నడిచారు. ఊరి బయట ఉన్న ఆ శ్మశానం దగ్గరకు వెళ్లారు. యువకుడన్నాడు - '' ఈ రోజు దీపావళి. అజ్ఞానాన్ని లోభ మోహాల్నీ మత్తునూ నాశం చేయవలసిన రోజు. అందరూ ఆ పని నూనె దీపాలతో. చేస్తారు మనం కాగితం దీపాలతో చేద్దాం. ఆ కాగితాలన్నింటినీ బొత్తులు బొత్తులుగా దూరం దూరంగా పెట్టు '' అన్నాడు.

ఆ కుర్రాడు అలాగే చేశాడు. యువకుడు అగ్గిపెట్టెతో ఆ బొత్తులన్నిటికీ వరుసగా నిప్పంటించు కుంటూ పోయాడు. మరు నిముషంలో ఒక పది గజాల పొడుగున అగ్ని జ్వాలలు పైకి లేచాయి. ''చూశావా, ఇదీ దీపావళీ ! దీప - ఆవళి అంటే దీపాల వరుస. అంధకారాన్ని తరిమేసే వరుస. నాకిప్పుడు తృప్తిగా ఉంది అసలైన వరుస నాకిప్పుడు తృప్తిగా ఉంది అసలైన దీపావళి జరుపుకున్నందుకు. ఇక పోదాం పద'' అన్నాడు యువకుడు ఆ ఇద్దరూ అక్కడ నుంచి కదిలారు

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 6-11-91)

★★★ ★★★ ★★★

# న్యాయం

సుబ్బమ్మ : దీన్నిగదరగ, ఎంతపన్జరిగింది! నెత్తికి సేతులొచ్చేసాయి పెట్లోంచి దీసి సాయిట్టో బల్లమీదెట్టి పొయ్యి కాడికి నడిశానో లేదో అయ్యికూడా నడిశేశాయి. ఆదిలోకి! ఒకటా, రెండా, అయిదొందలు- అయిదు తెల్లనోట్లు ఎట్టా కట్టబడ్డాను! అన్నింటికీ ఆ రెండు గొడ్లేగా ఆదారం! పాలమ్మాను పిడకలమ్మాను. నేను సంపాదిత్తన్నానని అంతా నన్నాడిపోసుగోటమే! ఈది సివర నాగరత్నం కన్నా, ఎలట్రీస్తంబంకాడ సాయిత్రికన్నా ఎక్కు కలిపానా ఏంటి నీళ్లు? ఇంతసేపు సచ్చినా ఆ ఒడ్డాణం తాకుట్టుకే పోయిందిగా! అది ఇడిపించాలనే గందా ఈ డబ్బు కూడబెట్టింది!! ఇయ్యాల డబ్బిచ్చి అది ఇడిపించుకోక పోతే తాకట్టు వాకట్టపుద్దని సావుకారు కబుర్జేశాడు ఇది కాత్తా పోయిందా .. నగ యిడిపించడానికి ఇంకో నగ తాకట్టు పెట్టాలా ఏంది? ఓరి నాయనో, ఇదేం కర్మరా దేవుడా ! ఇంటి మగాడికి, నాకు సెడబట్టేగాని లాకపోతే నేనింత దయిద్రం అనుబయించేదాన్నా?

ఇంతకీ ఇదంతా ఆ ముష్టాడి పనే. ఆ ఎదవ సచ్చినోడొచ్చినప్పుడేగా నేనింటో కెల్లింది. అదే

ఎగరేసుకు బోయుంటాడు. ఈడి జిమ్మడ, ఈడి మొదలార! మగాడు రానీ సెబుతా అణ్ణి బట్టించి మక్కెలిరగ బొడిపించి డబ్బు కక్కిత్తా. అసలింతకీ రోజులిట్టా సచ్చాయి, నాయం, నాయేమే లేదుగందా!

ముష్టివాడు: ఓశోస్, ఎంతలో సెక్కరం ఎట్టా తిరిగిపోనాది. అయిదొందలు ! సేతిలో కొచ్చినట్టే వొచ్చి ఇట్టే ఎగిరిపోయాయి! ఆ యమ్మలోని కెల్లింది బిచ్చమేత్తదనే నమ్మకం నా కేటి నేదు కొత్త నోటులు ఎంత దీని గున్నయ్! మరెనక సూపు నేదు, బేగీ దావడు గేసేసినాను కాలికిబుద్ది సెప్పేసినాను . అదేటో, అప్పడుఎయ్యాలా, దాగం! శిప్పనోడ్డుమీదెట్టి అందనోట్లెట్టి పైన క్రరెట్టి పంపుకింద నీల్లు తాగినాను కానా! ఎంత సిత్రవాలోశన్లొచ్చి నాయి! నాను అఅప్పిగాడితో కలిసి టీ కొట్టెడతాను ( ఆడి దగ్గరో రెండొందలున్నాయిలే) ఆ డొట్టి సంగిరెదవ తాగుపోతోడు. కొంచె నాబం వొచ్చీగానే అణ్ణి తన్ని తగిలెయ్యనూ! సింతసెట్టుకాడ పాకేసెయ్యనూ! మళ్లీ సంకురేత్తిరికో అరెకరం సెక్క కొనేసి పై ఏటికి ఎవసాయం, ఎవసాయం సేసెయ్యనూ- ఇట్టా వొచ్చీసాయి ఆలోశన్లు అశ్చర్యంగా అప్పుడే వొచ్చీనాడు గాడా యముడు! పోలీసెదవ! వొచ్చా నాంగానే సూసీసినాడు బయటపెట్టేసిన్నోటులు బట్టుకుపోనాడు గాదా! నానేటి, బయపడ్డమేటని ఎదిర్చినాను గానా! ఐనా, నాబం నేకపోనాది.ఛీ నాయాన్ని రచ్చించే వోడే నాయాన్ని బచ్చిత్తే ఇక నాయవేటి! నేదు,నేదు, మనస్సుల్లో నాయం సచ్చిపోనాది- తూ, ఎదవ పెపంచకం!

పోలీసు: ఎప్పుడూ రెండు ముడు తెల్లనోట్లకన్నా ఎక్కువ సూడనిఓణ్ణి ఇయ్యాల ఒక్కపాలి అయిదు చూశాను. అదే, ఆ ముష్టాడి సిప్పలో. నో.నో.ఈ డబ్బేటి , ఆడి కష్టార్జితమేటి? అదేదో సత్కరించేసిన బాపతని తెలిసిపోతానే ఉందిగా. మరింక సందేహమేటి? అందుకనే ఎల్లాను . గుడ్లురిమాను. లాటీ ఎత్తి బుజం మీదెట్టుకుని అడిగాను." ఏరా, ముష్టెదవా, ఈ నోట్లెక్కడివిరా, దొంగసొత్తు కాదూ, మాట్లాడవేరా, దొంగసచ్చినోడా? పద, స్టేషన్‌కి" అన్నాను ఆడు బిత్తరబోయాడు చేతులెత్తేశాడు. అంతే, అయిదు పచ్చల లక్ష్మి మన కొచ్చేసింది. లాకపోతే ముష్టెదవేటి, డబ్బునుబవించడమేటి?

జేబులోకి సేరగానే ఆ లక్షి నా బుర్రకి ' కిక్ ' ఇచ్చింది గాదా! 'రాత్రి సింహాచలం ముండ ఏం సుకమిచ్చింది !మరందుకనే 'సాన్ది' అన్నారు. అదిచ్చిన సారా వో. అదెంత రుచో, దాని సారా కూడ అంత రుచే. అందుకనే 'వొజ్రాలుంగరం చేయించు కనిష్టీబు' అనంగానే నా కెంత ఇదయిపోయింది! ఈ అయిదొందలకు వొజ్రాలుంగరంవస్తదా ?' ఇట్టి వచ్చాయి గదా ఆలోచన్లు. తీరా షరాబు దగ్గర కెల్తే ఆడు నాలుగొందలు కావాలన్నాడు గదా! జేబులో కొచ్చిన కొత్త నోట్లు అప్పుడే ఎందుకిచ్చేయాలని ఆ దోవనే హేడ్డు దగ్గర రెండొందలు అప్పుచ్చుకునొచ్చి షరాబు కిచ్చి" దీని కొచ్చిన బంగారం కొని పన్చేస్తూండవయ్యా, సాయంకాల వొచ్చి మిగిలిన డబ్బిస్తాను" అన్నాను గదా! అదుగో, అదే కొంప ముంచింది. సిటీ బస్సులో నాజేబెవడో కొట్టేస్తాడని కలగన్నానా? ఫుండాకోర్, ఆడుదొరకాల , నా సామిరంగా, తోలూడదీసి, మర్డర్ కేసు బనాయించి, రాజమండ్రి సెంట్రలు జైలుకు తోయించెయ్యనూ! - ఇంతకూ దేశంలో చాలినంత మంది పోలీసోళ్ళు లేరు. ఉంటే గనక, ఈ దొంగెదవలు , రౌడీఎదవలూ ఇట్లా ఎగబడతారా? ఒకణ్ణనే దేంటిలే, దేశంలో నీతి పంచదారకన్నా కరువైపోయింది న్యాయం, న్యాయం లేదు ప్చ్,.

సూపర్‌వైజరు: ఎలక్ట్రిసిటీ ఆఫీసులో పదిహేనేళ్ళ అనుభవం నాకు ఎంత సంపాదించాననీ! కాని, ఏం లాభం? ఎప్పుడూ పురుళ్ళూ. రోగాలే ఆ డబ్బు అల్లానే ఖర్చవుతూంది. నేను తక్కువ తిన్నానా?

పూర్వంకన్నా ఎక్కువగా లైన్ వైరూ, కాపర్‌వైరూ, టేపూ బయట అమ్ముతున్నాను కాదూ! అదే కొంప ముంచింది. నామీద ఎంక్వయిరీ తెప్పించేసింది. అక్కడికి ఎ ఇ అన్నాడు సుమా! " ఈ వేళ సాయంత్రంలోగా నీ తప్పులు కొన్నయినా ఒప్పుకుంటూ రాసిస్తివా , నీకు శిక్ష తగ్గుతుంది. లేదా, నీ ఉద్యోగం ఊడడమే కాక , శ్రీ కృష్ణ జన్మస్థానానికి కూడా వెడతావు." ఆ పొద్దుట్నుంచీ ఎ ఇ చెప్పినట్టు చేయాలనే కదూ అనుకుంటూ ఉంట. కానయితే నా బుద్ధి వక్రించిన పద్ధతి? సిటీ బస్సులో కానిస్టేబిలు జేబులో నోట్లమడత నా కంట్లోనే పడాలా? పడింది పో, ఎ ఇ ని కాదనాలనే ఆలోచన రావాలా? వచ్చింది పో , అతి సాహసంతో ఆ నోట్ల మడత మీద నా హస్తలాఘవం చూపించాలా? స్టాపుకు ముందర గానే కదూ దిగేసి రిక్షాలో వెళ్ళి ఎమ్.ఎల్.ఏ. నాయుణ్ని కలిశాను! అయిదు నోట్లూ పాదాల మీద పడేసి " నాయకుడా, రక్షించు. పిల్లలు గలవాడిని" అనగానే, వాటిని చేత్తో గాకుండా రుమాలుతో తీసి, జేబులో పెట్టుకుని, " మీ ఎ ఇ. మీద ఇల్లాంటి ఎలిగేషన్లు చాలా ఉన్నాయోయ్. మంత్రిగారితో చెప్పి ఆ ఎ ఇ కే ఇక్కడినుంచి ఉద్వాసన చెప్పిస్తాగా" అన్నాడు కద!

నిశ్చింతగా ఉండచ్చు నేను. కాని, ఏమయింది? ఈ వేళకి వారమయింది నాయుడు హైదరాబాదు పోయి. నా కేమో సస్పెన్షన్ ఆర్డరు, ఆ పైన అరెస్టు వారంటు వచ్చేశాయి. ఎంత పరువుగా బతికాను, ఎంత గతి పట్టింది!నేను చెడింది నాయుడు వల్ల కాదూ? డబ్బు పుచ్చుకుని పని చేయలేదు. ఎంత మోసం! ఇలాంటి వాడినా ప్రజలు ఎన్నుకునేది! ఇంతకీ నాయుణ్ణి అని ప్రయోజనమేముంది? దేశంలో కరప్షన్ పెరిగిపోయింది. నాయకుల్లో తెగ పెరిగి పోయింది. నీతి లేదు, న్యాయం లేదు. ఛీ!ఛీ!

ఎమ్.ఎల్.ఏ : డామిట్! ఎంత పని జరిగింది ఇంత కాలంగా నేను ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నానో అవన్నీ ఈ గుమాస్తాగాడి విషయంలో ఎగిరి పోయినాయి! మానవుడినై పుట్టినందుకు కనీసం మంత్రి నయినా అవుదామనేగా నా తాపత్రయం. దానికై ఎన్ని అవస్థలు పడాలి. ఎంత డబ్బు ఖర్చు చేయాలి! అందుకనేగా ఎవడే తృణ మిచ్చినా అతి జాగ్రత్తగా దాస్తున్నది! ఆ గుమాస్తా వచ్చి ఇచ్చింది అయిదొందలు, బెట్టు చేస్తే ఇంకొంచెం పడేసే వాడేమో. 'సరేలే, రాల్చుకోలేకపోతానా' అనుకున్నాను కాని, నా కున్నది కాస్తా సి.ఐ.డి ఇన్‌స్పెక్టరు రాల్చేస్తాడని కలగన్నానా? అసలు జరిగిందేమిటి? కలక్షన్‌లన్నీ సెక్రటరీ చేత బాంకులో వేయించే అలవాటున్న నేను ఆ పూట స్వయంగా బాంకుకు వెళ్ళాను అయిదు నోట్లూ తీసుకొని అదీ నేను చేసిన పొరపాటు ఇంకేముంది. ఎవడో సిఐడి.ఇన్‌స్పెక్టరట - " ఈ దొంగనోట్లు మీ కెక్కడివి?" అంటూ నిలేశాడు. చచ్చినంత పనైంది. అయినా తెలివిగా నవ్వేశాను. వాడు కోపాన్ని కక్కేశాడు " రాత్రి ఊళ్ళోకి దొంగనోట్ల కారు వచ్చినట్లు మాకు తెలుసు. వెతకబోయిన తీగె కాలికి తగిలినట్టు మీరే వచ్చారు. సంతోషం"! అన్నాడు. తీరా చూద్దును గదా , అవ్వే ఆ నోట్లే, సందేహం లేదు! ఇవ్వి నా దగ్గర కెలా వచ్చాయి? అర్థంకాలేదు. మతి పోయింది.

ఆ పోయిన మతి, ఇన్‌స్పెక్టరు నన్ను మా ఇంటి దగ్గర కారులోంచి దింపుతూవుంటే వచ్చింది. వచ్చింది కానీ ఆ రాస్కెల్ నన్ను మాట్లాడనిస్తేనా? ఇంట్లో అన్ని మూలలా వెతికించాడు. పరుపు కింద ఉన్న సూట్‌కేసును బయటకు తెచ్చాడు. నా దగ్గర తీసుకున్న నోట్ల నంబర్లను కేసులోని వాటితో పోల్చి చూశాడు. ఈ లోపల నేను ఇంటి ఆడదాన్ని , సుబ్బమ్మను పక్కకు పిలిచాను. " ఏమే" అన్నాను. అదేం చెప్పింది " పొద్దుటేల పరుపెత్తుతా ఉంటే కింద సూట్‌కేసు కనిపించింది. సరే, లోకోపకారం కోసం యాటికాడో పుణ్యం కట్టుకోనుంటాడనుకుని నా కాడున్న చిల్లర నోట్లు తీసి అడబెట్టి అదున్న

కొత్తాట్లోంచి అయిదు తీసుకున్నాను. చివరి కయి ఎవడో ముష్టెదవ ఎత్తుకుపోయాడులే ... ఇంతకీ నీకిదేం పోయే కాలం?'' అంది నా కొళ్ళు మండిపోయింది. ' నన్నే ఎదిరిస్తోందా' అనుకున్నాను '' అంటే?'' అన్నాను.

'' అయి 'ఆ బాపత'ని నాకు చెప్పద్దా, జాగర్తగా దాచేదాన్ని గందా'' అంది ఇప్పుడీ ఊబిలోంచి బయట పడడమెలాగ? వారం అయింది ఇక్కడి కొచ్చి మంత్రి బావగారు డ్యూటీ మీద జపానెళ్లాడంట ముఖ్యమంత్రికీ , నాకూ చుక్కెదురు. ఈ సి ఐ.డి ని చూడబోతే నా తాలూకా పంతులమ్మ రేప్‌కేసులూ, మర్డర్ కేసులూ కూడ కెలికేట్లున్నాడు ఎంతగానో బతిమాలుతున్నాను, '' ఇంత , ఇంతకాకపోతే అంత, అంత కాకపోతే మరోఅంత పుచ్చుకోవయ్యా'' అని. '' ససేమిరా'' అంటున్నాడు. లోకల్ సి.ఐ డి.ల పర్సనల్ రిపోర్టులు రాసే అధికారం ఎమ్.ఎల్ ఎలకు ఎప్పుడొస్తుందో గదా!

నాకీ కష్టాలు రావడానికి కారణం ఆ గుమాస్తాగాడే. కొంపదీసి ఆడు నా ఇంటికి మారుమొగుడు కాడుకదా! ఇంతకీ ప్రజల్లో, ముఖ్యంగా ఉద్యోగస్థుల్లో నీతి అనేది చచ్చిపోయింది. న్యాయం అసలే లేదు మరింక ఈ దేశానికి మోక్షమే లేదు!

(ఆంధ్రప్రభ సచిత్రవార పత్రిక 11-4-73)

*** *** ***

# శిలాశాసనం

ప్రిన్సిపాల్ పరీక్షిత్తు నెత్తిమాద కొత్త ఉషాఫాన్ ఫుల్ స్పీడ్ లో తిరుగుతోంది. అతని కుర్చీ చుట్టూ ఆఫీసు పరివారం- సూపర్నెంటు, యుడిసి యల్.డి.సీ., టైపిస్టు, ప్యూన్లూ ఉన్నారు. లెక్చరర్లలో నమ్మిన బంట్లన్నవారు కూడా కొంతమందయినా అప్పుడు అక్కడుండాల్సిందే. కానీ, అతనికీ లెక్చరర్లకూ చెడింది. స్టూడెంట్సు తమంత తాముగా తమడిపాజిట్ల డబ్బు త్యాగం చేసి కాలేజీకి ఒక ఫాను కొనిచ్చారు, ఈ కొనటంలో వాళ్ళకు సలహా లిచ్చినవాళ్ళు లెక్చరర్లు, కొంత డబ్బును లెక్చరర్లు అమ్యామ్యా చేసి ఉంటారని ప్రిన్సిపాల్ అనుమానం. అసలు ప్రిన్సిపాలే దాన్నంతనీ అమ్యామ్యా చెయ్యాలనుకున్నాడని, అది కుదరనందున కోపంతో ఉడికిపోతున్నాడనీ లెక్చరర్ల భావన. ఏమయితేనేం అతనికీ వాళ్ళకూ మధ్య చిన్న అయోధ్య మొలకెత్తింది. దీనిక తోడు ప్రిన్సిపాల్ ఆ ఫానును తన గదిలోనే బిగించుకోవాలని నిర్ణయించుకున్నాడు. దీంతో లెక్చరర్లు అవసరమయినప్పుడు తప్ప, మిగిలిన సమయాల్లో అతని దగ్గరకు రావటమే మానేసారు.

ఇప్పుడు ఫాన్ బిగించటం అయిపోయి మొదటి సారిగా తనసీట్లో కూర్చుని సుఖంగా ఫాను గాలిని అనుభవిస్తున్న ప్రిన్సిపాల్ పరీక్షిత్తు అలవోకగా నవ్వుల్తో తన పరవార జనాన్నోమాటు వీక్షించి, కొత్త పెళ్ళి కొడుకు లాగా సాగసులు పోయాడు ఉండి ఉండి ఓ మాటు అతను పైకి చూసాడు. ఫుల్ స్పీడ్‌లో తిరుగుతున్న ఆ ఫాను అటూ ఇటూ కదులుతోంది. అతను అదిరిపోయాడు కంగారుగా లేచి చటుక్కున అవతల కొచ్చి అన్నాడు. '' ఏమయ్యా సనకసనందనం, ఇది ఊడి నానెత్తిన పడేట్టుంది ఇట్లాగటయ్యా బిగించటం ! ఏదో ముచ్చట పడుతున్నావనీ, పాతికరూపాయలు ఆదా అవుతుందనీ నిన్ను బిగించ మంటే నువు నాకు టపా కట్టించేట్టున్నావే!''